సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 19 । మే । 2024



పలకరించిన తొలకరి 8లో

ఈ ఏడాది తొలకరి కాస్త ముందుగానే పలకరించింది. దీంతో జిల్లాలో రైతులు దుక్కులతో పాటు, చెరకు ఉడుపులకు సిద్ధమవుతున్నారు.



సింహగిరి కిటకిట

సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.3/26.0

వాతావరణం

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు. ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

జల సిరులు చేరువై...



నిర్మాణంలో ఉన్న చెరువు గట్టు (ఫైల్)



చెరువు గట్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- 'సమీకృత వ్యవసాయ పరివర్తన పథకం' తో సాగునీటి ఇబ్బందులకు చెక్
- అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 98 చెరువుల నిర్మాణ పనులు
- ఇప్పటికే చివరి దశకు చేరుకున్న 42 చెరువుల నిర్మాణం
- ఒక్కోదాని అంచనా వ్యయం రూ.30 లక్షల నుంచి రూ. 60 లక్షలు
- మొత్తం నిర్మాణాల అంచనా వ్యయం రూ.28 కోట్లు
- 2025 నవంబర్ నాటికి ప్రాజెక్టు పూర్తికి ప్రణాళికలు

సాక్షి, అనకాపల్లి: ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి పరిరక్షించుకోవాలి. వ్యవసాయానికి అనుకూలంగా.. ఆత్మబంధువుగా మలుచుకోవాలి. శివారు పంట పొలాలు సైతం నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకే ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 98 చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం అమలు పూర్తయితే చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరుతాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు లేక సకాలంలో పంటలు పండించలేకపోతున్నారు. దీంతో అన్నదాతలు ఆశించినంత మేర ఆదాయం పొందలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం ద్వారా నిర్మాణం చేపడుతున్న చెరువులు రైతులకు ఆత్మబంధువుల్లా మారుతున్నాయి. వర్షాలు కురిసే సమయంలో చెరువుల్లో నీరు నిల్వ ఉంచితే అన్నదాతలకు అవసరమయ్యే సమయంలో ఉపయోగపడుతుంది. ముందస్తుగా తగిన నీటి సదుపాయం ఉంటే వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడానికి ఆస్కారం ఉంటుంది.

7:3 నిష్పత్తిలో నిర్మాణం

ప్రపంచ బ్యాంకు 70 శాతం, ఏపీ ప్రభుత్వం 30 శాతం నిధులతో సంయుక్తంగా ఈ పథకం ద్వారా చెరువుల నిర్మాణం చేపట్టారు. మొత్తం 98 చెరువుల నిర్మాణం, ఆధునికీకరణకు శ్రీకారం చుట్టగా.. వాటిలో 42 చెరువుల నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. మరో 22 చెరువులు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. 34 చెరువుల నిర్మాణం పనులు టెండర్ దశలో ఉన్నాయి. రూ.28 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒక్కో చెరువు నిర్మాణానికి రూ.30 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు కేటాయించారు. వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో శరవేగంగా పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో స్వతంత్ర, గొలుసుకట్టు చెరువులు, పెద్ద చెరువులు, చిన్న చెరువులు ఉన్నాయి.

ఐదు శాఖలు సంయుక్తంగా..

వాతావరణంలోని మార్పులను తట్టుకుని వ్యవసాయ ఉత్పాదకతను, ఆదాయాన్ని పెంచే విధంగా రైతులు పంటలను పండించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని విస్తృతం చేశారు. వ్యవసాయ, భూగర్భజల, నీటిపారుదల, ఉద్యావన, మత్స్యశాఖ సంయుక్తంగా చెరువుల నిర్మాణాలు చేపడుతున్నాయి. కనీసం 100 ఎకరాల నుంచి గరిష్ఠంగా 150 ఎకరాల వరకూ సరిపడా సాగునీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఒక్కో చెరువుకు ఉంటుంది. చెరువుల్లో నీటి సాంద్రతను నెలవారీ పిజోమీటర్ డ్రిల్లింగ్ చేసి తెలుసుకునే సదుపాయం కూడా కల్పించారు.

రెండు లక్షల మంది రైతులకు లబ్ధి

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈ చెరువుల నిర్మాణం ద్వారా సుమారు రెండు లక్షల మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు లాభపడనున్నారు. చెరువుల నిర్మాణం, అభివృద్ధితో భూగర్భ జలాల పెరుగుదల సాధ్యమవుతుంది. చెరువుల అభివృద్ధితో రైతులు సకాలంలో పంటలు వేసుకోవడంతో పాటు ఏడాదికి మూడు పంటలు పండించుకునే అవకాశం కలుగుతుంది. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచుకోవడం, వాతావరణ సానుకూల పద్ధతులను ప్రోత్సహించడం సాధ్యపడుతుంది.

రైతు బాంధవులుగా చెరువుల నిర్మాణం



అన్నదాతలకు ఉపయోగపడేలా చెరువుల నిర్మాణం, అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఏపీ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకం 2020లోనే ప్రారంభమైంది. కరోనా కారణంగా పనులు మందకొడిగా సాగాయి. ఆ తరువాత నుంచి శరవేగంగా పనులు జరుగుతూ వస్తున్నాయి. వచ్చే ఏడాది నవంబర్ నెలాఖరునాటికి పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. గ్రామాల్లో వ్యవసాయానికి తోడ్పాటు అందించేవి చెరువులే. వర్షాలు పడేటప్పుడు నీరు నిల్వ ఉండేందుకు చెరువులు ఉపయోగపడతాయి. వ్యవసాయానికి నీరు అందించే బోరుబావుల్లో వేసవి సమయాల్లో నీరు అడుగంటకుండా సహాయపడుతుంది. భూగర్భజలాలను నిల్వచేయడంతో పాటు చేపల పెంపకంతో మరింత ఆదాయ వనరులను పెంచుకోవచ్చు. ప్రధానంగా వ్యవసాయ సాగునీటి విస్తీర్ణం పెంచుకోవచ్చు.

-కె.రమేష్‌బాబు, ఏపీఐఐఏటీపీ సహాయ ప్రాజెక్టు అధికారి

ఏలేరు కాలువలో చురుగ్గా పూడిక తీత



పొక్లెయిన్‌తో ఏలేరు కాలువలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది



పూడిక తీశాక నిండుగా ప్రవహిస్తున్న నీరు

నాతవరం: ఏలేరు కాలువలో పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే కాలువలో నీటి ప్రవాహం పెరగడంతో పాటు నీటి వృథాకు అడ్డుకట్టపడుతుంది. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి 154 కిలోమీటర్ల పొడవున గల ఏలేరు కాలువ ద్వారా ప్రతి రోజు 300 క్యూసెక్కుల చొప్పున విశాఖపట్నానికి నీటిని తరలిస్తున్నారు. దీనిని ప్రజల తాగునీటి అవసరాలతో పాటు పలు పరిశ్రమలకు వినియోగిస్తున్నారు. ఈఏడాది కాలువలో పూడిక తొలగింపుతో పాటు పలు చోట్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను వచ్చే నెలాఖరులోగా లోపు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఏలేశ్వరం రిజర్వాయర్ అధికారులు, విశాఖపట్నం జీవీఎంసీ అధికారులు సంయుక్తంగా గత నెల పనులు ప్రారంభించారు. ప్రస్తుతం 100 కిలో మీటర్లకు పైగా పూడిక తీశారు. పూడిక తీత పనులతో పాటు ఏలేరు కాలువ గట్లపై ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి, మరమ్మతులు చేపడుతున్నారు. ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా ప్రతి రోజు 300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తే పూడిక తీయక ముందు విశాఖపట్నానికి కేవలం 155 నుంచి 160 క్యూసెక్కులు మాత్రమే చేరేది. కాలువలో కొంత భాగంలోని పూడిక తొలగించాక ప్రస్తుతం 175 నుంచి 180 క్యూసెక్కుల మధ్య నీటి ప్రవాహం పెరిగింది.

వచ్చే నెలాఖరులోగా పనులు పూర్తి

పూడిక తీత పనులు జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. పనుల్లో నాణ్యతాప్రమణాలు పాటిస్తున్నాం. గతంలో అధ్వానంగా ఉండే కాలువ ఇప్పుడు పరిశుభ్రంగా ఉంది.

- నానాజీ, జేఈ ఏలేరు కాలువ

వసూళ్లపై విజిలెన్స్ ఆరా!

- భద్రతపై బాధ్యతగా వ్యవహరిస్తున్నాం..
- వసూళ్లపై దృష్టిసారిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ కనెక్షన్ల మంజూరులో వసూళ్ల పర్వానికి పాల్పడుతున్న వైనంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. గతేడాది కాలంగా ఎక్కడెక్కడ ఎన్ని వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశారో.. దానికి సంబంధించిన వివరాలను విజిలెన్స్ సేకరిస్తోంది. ఉమ్మడి విశాఖలో తరచుగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై 'సమన్వయ లోపంతో షాక్' శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై విజిలెన్స్ దృష్టి సారించింది. మరోవైపు కథనంపై ఈపీడీసీఎల్ సర్కిల్ అధికారులు స్పందిస్తూ విద్యుత్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. అదేవిధంగా సబ్బవరం, ఇతర మండలాల్లో రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బందిపై దృష్టి సారిస్తున్నామనీ.. బాధ్యులపై చర్యలకు ఉపక్రమిస్తామని ఎస్ఈ మహేంద్రనాథ్ అన్నారు. రెండు నెలల కాలంలో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన హెల్పర్స్.. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లడం వల్ల దురదృష్టకరమైన ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ విషయంలో మిగిలిన వారందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈ తెలిపారు. అదేవిధంగా కశింకోట డివిజన్ పరిధిలో ప్రతి చోటా వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని డివిజన్ ఈఈ రామకృష్ణ తెలిపారు. విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు.

న్యూస్‌రీల్

సబ్ జైల్‌ను సందర్శించిన న్యాయమూర్తి



మాట్లాడుతున్న న్యాయమూర్తి మధుసూధనరావు

నర్సీపట్నం: స్థానిక సబ్‌జైల్‌ను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూధనరావు శనివారం సందర్శించారు. అందుతున్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఇస్తున్న మెనూపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. వారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థికస్థోమతలేని వారికి మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. అటువంటి వారు ఎవరైనా ఉంటే జైలు సూపరింటెండెంట్‌కు వివరాలు ఇవ్వాలని సూచించారు. సీనియర్ న్యాయవాది పి.నాగేశ్వరరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హీరాకుడ్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): అంబాలా డివిజన్, శంభు స్టేషన్ పరిధిలో జరుగుతున్న రైతు ఆందోళనల నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్‌డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం – అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో 22వ తేదీన అమృతసర్‌లో బయల్దేరే అమృత్‌సర్–విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో వయా జఖల్, దూరి, లూధియానాల మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- ఎస్పీ మురళీ కృష్ణ



పదవీ విరమణ చేసిన హోంగార్డుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: పోలీసుశాఖలో అంకితభావంతో పనిచేస్తే తప్పక గుర్తింపు లభిస్తుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. హోంగార్డుగా పని చేసి పదవీ విరమణ చేసిన ఎం.రామలింగానికి జిల్లాలో హోంగార్డుల ఒక రోజువేతనం రూ.3,86,240 చెక్కును ఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో రామలింగం విధులు నిర్వహించినట్టు చెప్పా రు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ఏవోబీ.శారద, కార్యాలయం సిబ్బంది వరలక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి రెండో విడత చందనం అరగదీత ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 23న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు తెల్లవారుజామున స్వామికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చిచందనం (120 కిలోలు) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమం చేపట్టారు. ఉదయం 7 గంటలకు చందనం చెక్కలకు పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ భాండాగారం వద్ద బేడామడపంలో 20 మంది సిబ్బంది అరగదీతను శాస్త్రోక్తంగా ప్రాంభించారు. తొలిరోజు 31 కిలోల చందనాన్ని అరగదీశారు. ఈ చందనాన్ని అర్చకులు తూకం వేసి భద్రపరిచారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఏఈవో ఆనంద్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా ఏడాదిలో నాలుగుసార్లు మూడు మణుగుల చొప్పున పచ్చి చందనాన్ని సమర్పిస్తారు. చందనోత్సవం రోజు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజు చందనం సమర్పణ జరుగుతుంది. ఈనెల 10న చందనోత్సవం రోజు తొలివిడత చందన సమర్పణ చేశారు. రెండో విడతగా ఈనెల 23న వైశాఖ పౌర్ణమి రోజు చందనాన్ని సమర్పించనున్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా



స్ట్రాంగ్‌రూంలను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా, చిత్రంలో విశాఖ కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

మహారాణిపేట(విశాఖ): ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, పోలీసు కమిషనర్ డాక్టర్ రవి శంకర్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. విశాఖ పార్లమెంటుతో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమలను తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులను గమనించారు. తలుపులకు వేసిన తాళాలను, వాటికున్న సీళ్లను పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం లాగ్ బుక్‌లో మీనా సంతకం చేశారు. మూడెంచల భద్రతను పాటించాలని, ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సూచించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్న ప్రాంతంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడని ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం జాగ్రత్తలు వహించాలన్నారు. పర్యటనలో భాగంగా అక్కడి పరిస్థితులను, జిల్లా యంత్రాంగం తరపున చేపట్టిన చర్యలను సీఈవోకు కలెక్టర్, పోలీసు కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు డి.హూస్సెన్ సాహెబ్, సీతారామమ్మూర్తి, శేష శైలజ, అఖిల పాల్గొన్నారు.

సింహగిరికి ఎలక్ట్రిక్ బస్సు సర్వీసు

- ప్రారంభించిన దేవస్థానం చైర్మన్ అశోక్ గజపతిరాజు
- రూ.1.65 కోట్లతో కొనుగోలు
- 18 లక్షలతో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు పనులు
- త్వరలో రానున్న మరో బస్సు



బస్సుకు పూజలు నిర్వహిస్తున్న అశోక్‌గజపతిరాజు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : సింహగిరి ఘాట్‌రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసును శనివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రారంభించింది. దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో బస్సుకు అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఆయనతో పాటు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, పలువురు ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు రెండో టోల్‌గేట్ ద్వారా సింహగిరికి బస్సులో తరలివెళ్లారు. ఈసందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ భక్తులే భగవంతునికి నిజమైన ప్రతినిధులని, భగవంతుడికి ఇచ్చిన విరాళాలు వృథా చేయకూడదని, భక్తుల సౌకర్యాల కోసం ఖర్చు చేస్తే హర్షిస్తాడన్నారు. భగవంతుడు ఇచ్చిన సృష్టిని భావితరాలకు అందించాలన్నారు. పర్యావరణ పరిక్షణలో భాగంగా దేవస్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సింహగిరి ఘాట్‌రోడ్డులో రెండు ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని నిర్ణయించామని. తొలుత రూ.1.65 కోట్లతో కొనుగోలు చేసిన బస్సును ప్రారంభించామన్నారు. మొత్తం 42 సిట్టింగ్ కెపాసిటీ, స్టాండింగ్ కెపాసిటీ 30 ఉంటుందన్నారు. రెండున్నర గంటలు చార్జ్‌చేస్తే 225 కిలోమీటర్లు ప్రయాణించవచ్చన్నారు. టికెట్టు రూ.15గా నిర్ణయించామన్నారు. రెండో బస్సు కొనుగోలుకు కూడా ఇప్పటికే 50శాతం నగదును చెల్లించినట్టు చెప్పారు. అతిత్వరలోనే ఆ బస్సు కూడా దేవస్థానానికి రానుందన్నారు. రూ.18 లక్షలతో 18కేవీ కెపాసిటీతో శ్రీకృష్ణాపురం గోశాలలోనే చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం కంపెనీ సమకూర్చిన అనుభవజ్ఞులైన డ్రైవర్లతో బస్సును నడుపుతున్నామని చెప్పారు. దేవస్థానం డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ అనంతరం వారే ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, డీఈ హరిరాజు, ఏఈ గోవర్ధన్, సూపరింటెండెంట్లు యనమండ్ర అప్పారావు, సుసీల్, సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి



లక్షమల్లెలతో అమ్మవారికి అర్చన

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్ళపాటి కృష్ణకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున సంకీర్తనలతో వైభవంగా తిరువీధి మహోత్సవం జరిపారు. శ్రీనగరేశ్వరి స్వామి, శ్రీ జనార్దన స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవారి ఉత్సవమూర్తికి ఆలయ ముఖమండపంలో ధాన్యాభిషేకం, అల్లెపు కామేశ్వరరావు లలితా దంపతులచే అమ్మవారికి లక్షమల్లెలతో అర్చన, శ్రీ వాసవీ పార్థసారథి గీతా మహిళా సమాజం ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీధరాల సోమరాజు నిర్మల, కృష్ణపేర్రాజు శైలజా దంపతులచే నిరుపేదలకు చీరల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద అన్న సమారాధన, వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో సాయంత్రం 102 రకాల స్వీట్లతో అమ్మవారికి నివేదన, రాత్రి కన్యకాపరమేశ్వరి ఉంజల్‌సేవ కార్యక్రమాన్ని బిళ్లపాటి కృష్ణకుమార్ గీతాపార్వతి దంపతులచే జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తికి అభిషేకం చేస్తున్న భక్తులు

సీబీఎస్ఈపై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

కశింకోట: సీబీఎస్ఈపై ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులకు సక్రమంగా పాఠాలు బోధించాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(ఆర్‌జేడీ) విజయభాస్కర్ తెలిపారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో 9,10 తరగతులకు విద్యార్థులకు గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. మండలంలోని తేగాడ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూలు)లో ఇచ్చిన ఈ శిక్షణ శనివారం ముగిసింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు ఆకళింపు చేసుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడానికి కృషి చేయాలన్నారు. సాంఘిక, జీవ శాస్త్రాలు బోధించే ఉపాధ్యాయులకు కూడా ఇదే తరహాలో సోమవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి అప్పారావు, రాష్ట్ర పరిశీలకురాలు శ్రీలత, జిల్లా సీబీఎస్ఈ విద్యా సమన్వయకర్త విజయలక్ష్మి, ఎంఈవో కె.చిట్టిబాబు, కెఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియంలతో విజ్ఞానం 8లో



క్లుప్తంగా

వాదోపవాదాలకు తావీయవద్దు

- ఎన్నికలపై ప్రజలకు అనకాపల్లి డీఎస్పీ సూచన



ప్రజలతో మాట్లాడుతున్న డిఎస్పీ

చోడవరం రూరల్: ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలకు సంబంధించి ఎటువంటి వాదోపవాదాలకు దిగరాదని, ఎలాంటి వదంతులను నమ్మరాదని అనకాపల్లి పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు ప్రజలకు సూచించారు. శనివారం రాత్రి ఆయన మండలంలోని ముద్దుర్తి, గౌరీపట్నం ప్రజలతో సమావేశమయ్యారు. చోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ సూర్యనారాయణలతో కలసి రెండు గ్రామాల్లో పర్యటించారు. అక్కడి రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ముందుగా ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరగడానికి సహకరించిన అన్ని వర్గాలవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ఎలా ఉన్నా, ప్రజలంతా సంయమనంతో మెలగాలని హితవు పలికారు. ప్రజాతీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. దీనికి సంబంధించి అనవసర చర్చలు, వాదనలు పెట్టుకోవద్దన్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇదే రీతిలో పలు గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచేందుకు సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

మ్యూజియంలతో విజ్ఞానం

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో ఏర్పాటు చేసిన మ్యూజియంలు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తున్నాయని జిల్లా టూరిజం అధికారి జ్ఞానవేణి అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా శనివారం ఆమె తీరంలోని టీయూ142 యుద్ధవిమానం, కురుసర సబ్‌మెరియన్, సీ హరియర్, మారిటైం మ్యూజియం, తెలుగు మ్యూజియంలను సందర్శించి పర్యటకులతో ముచ్చటించారు. మ్యూజియంల గొప్పతనంపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నర్సీపట్నం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ సాంబశివరావు అందించిన వివరాలు. మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలేనికి చెందిన వి.నానిబాబు అబిద్‌సెంటర్లో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. నానిబాబు ద్విచక్రవాహనంపై శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వెళ్తుండగా బయపురెడ్డిపాలెం సమీపంలో కుక్క అడ్డంగా రావడంతో పడిపోయాడు. తలకు బలమైన గాయం తగిలింది. 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలకరించిన తొలకరి

- సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- 24 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం
- రాయితీపై 768 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు



పోతనపూడిలో చెరకు ఉడుపులు చేస్తున్న రైతులు

మాడుగుల: ఈ ఏడాది తొలకరి కాస్త ముందుగానే పలకరించింది. దీంతో జిల్లాలో రైతులు దుక్కులతో పాటు, చెరకు ఉడుపులకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సాగుపై ఆర్బీకేల ద్వారా రైతులకు సిబ్బంది సూచనలు అందించారు. ఈ మేరకు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆర్బీకేల్లో పచ్చి రొట్ట ఎరువులకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లో వీటిని రైతులకు అందించనున్నారు.

ఆర్బీకేల ద్వారా విత్తనాలు

వర్షాలు అనుకూలించడంతో ప్రస్తుతం రైతులు చెరకు ఉడుపులు ప్రారంభించారు. అపరాలు వేయడానికి మెట్ట దుక్కులు ముమ్మరంగా చేపడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వరి విత్తనాలు సుమారు 24 వేల క్వింటాళ్లు, పచ్చి రొట్ట ఎరువులు 768 క్వింటాళ్లు పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని సరఫరా చేయనున్నారు. గత ఏడాది 58 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేయగా, ఈ ఏడాది సుమారు 70 వేల ఎకరాలకు సాగు పెంపు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం పచ్చి రొట్ట ఎరువులు వేయడం ద్వారా రసాయన ఎరువులు వాడకం తగ్గడంతో పాటు, అధిక దిగుబడులు రావడంతో రైతులు పచ్చి రొట్ట ఎరువులపై దృష్టి సారించారు. వ్యవసాయ శాఖ కూడా రైతులు ఆశించిన స్థాయిలో పచ్చిరొట్ట ఎరువులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

అగ్రి ల్యాబ్‌లలో విత్తన నాణ్యత పరీక్ష

నియోజకవర్గానికి ఒక అగ్రి ల్యాబ్ ఏర్పాటుతో రైతులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతోంది. విత్తన నాణ్యత పరీక్షలకు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పాయి. రైతులు నమూనా విత్తనాలు అందించిన వెంటనే నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారు. త్వరిత గతిన నివేదికలు కూడా అందిస్తున్నారు. దీంతో మొలక శాతం బాగున్న విత్తనాల ఎంపిక రైతులకు సులభతరమవుతోంది. అగ్రి ల్యాబ్‌లు అందుబాటులోకి రావడంతో ప్రైవేట్ వ్యాపారులు కూడా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నారని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అండగా ఆర్బీకేలు



తొలకరి వానలతో ఖరీఫ్ వరి నారు మడుల్ని సిద్ధం చేస్తున్నాం వేసవి దుక్కి లాభాలను ఆర్బీకే అధికారులు వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల్ని భూముల్లో కలియ దున్నడం వల్ల రసాయన ఎరువుల వాడకం, పెట్టుబడి వ్యయం తగ్గింది. అధిక దిగుబడులు కూడా వస్తున్నాయి. ఆర్బీకేల ఏర్పాటుతో రైతుల దశ తిరిగింది.

– పల్లే రామునాయుడు, రైతు, గాదిరాయి

సకాలంలో విత్తనాల పంపిణీ

రెండు మూడు రోజుల్లో రైతులకు పచ్చిరొట్ట ఎరువులు రాయితీ ధరలపై సరఫరా చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఖరీఫ్ వరి విత్తనాలు కూడా త్వరలో ఆర్బీకేలా ద్వారా అందిస్తాం. రైతులకు అవసరమైన స్థాయిలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులకు అన్ని దశల్లో తోడ్పాటు, సలహాలిచ్చేందుకు మా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

– బి.మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

ఎల్‌బీ పురంలో వివాహిత ఆత్మహత్య

- అత్తింటి వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు





మృతి చెందిన కిల్లి శ్రావణి, పక్కన (ఫైల్)

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీ పురానికి చెందిన కిల్లి శ్రావణి(28) ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందింది. అత్తింటి వేధింపులే తన బిడ్డ మరణానికి కారణమంటూ పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మేడ మీద నిద్రపోయేందుకు శ్రావణి వెళ్లింది. శనివారం ఉదయం ఆమె ఎంతకీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చూసేసరికి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. ఈమె భర్త ఢిల్లీలో ఆర్మీ విధుల్లో ఉన్నారు. శ్రావణి తల్లిదండ్రులతో కలిసి గాజువాకలో నివాసం ఉంటోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు అత్తవారింటికి వచ్చింది. అత్త పక్షవాతంతో మంచాన పడటంతో అప్పుడప్పుడు వచ్చి ఆమెకు సపర్యలు చేస్తుండేది. శుక్రవారం ఇంట్లో ఏం జరిగిందో తెలియదని, శనివారం ఆమె ఉరేసుకోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతురాలికి నాలుగేళ్ల వయసున్న కొడుకు ఉన్నాడు. శనివారమే శ్రావణి తన భర్తను చూసేందుకు ఢిల్లీ వెళ్తానని చెప్పిందని, ఇంతలోనే ఈ దారుణం జరిగిందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వాపోతున్నారు. శ్రావణి తండ్రి నాయుడుబాబు తన కుమార్తె చావుకు కారణం ఆమె మరిది, తోడికోడలు, ఆడపడుచులేనని బుచ్చెయ్యపేట పోలీసులకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తరుచూ తన కుమార్తెను తిడుతూ, హింసించడం వల్లే భరించలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

శ్రావణి మృతదేహాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఢిల్లీలో ఉన్న భర్త శనివారం రాత్రి ఇంటికి చేరడంతో శ్రావణి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రామం సుభిక్షంగా ఉండాలని..

- 24 గంటలు పూజా కార్యక్రమాలు నిర్వహించిన బ్రాహ్మణులు



గ్రామంలో 24 గంటల భజనలు, పూజా కార్యక్రమాల్లో బ్రాహ్మణులు, గ్రామ పెద్దలు

నాతవరం: మండలంలోని వైబీ అగ్రహారం గ్రామంలో పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం మేరకు శనివారం 24 గంటలపాటు ఆధ్యాత్మిక, పూజా కార్యక్రమాలు నిర్వహించి, బ్రాహ్మణులు తమ మాతృభూమిపై మక్కువ చాటుకున్నారు. గ్రామంలో పూర్వం అధిక శాతం బ్రాహ్మణులే ఉండేవారు. కాలక్రమంలో వీరిలో ఎక్కువ మంది ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయినప్పటికీ గ్రామంలో ఏ పని తలపెట్టాలన్నా వారి ప్రోత్సాహం తప్పనిసరి. అందులో భాగంగానే ఇటీవల సర్పంచ్ కోసూరి విజయ, భర్త కోసూరి బుజ్జి అధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి రామాలయం, మైసమ్మతల్లి ఆలయాలు నిర్మించారు. గ్రామం ఏర్పడినప్పటి నుంచి బ్రాహ్మణులు ఏటా వేసవిలో గ్రామం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ పూజలు చేస్తుండేవారు. 1964లో వర్షాల్లేక కరవుతో అల్లాడిపోతుంటే సూరి ఆనంత విజయరామశర్మ ఆధ్వర్యంలో ఏకధాటిగా 24 గంటలపాటు భజనలు, పలు హోమాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో వాతావరణంలో మార్పు వచ్చి వర్షాలు కురిశాయట. తర్వాతి నుంచి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలకు బాగుందని పూర్వీకులు చెబుతున్నారు.

ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈసారి కూడా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా విచ్చేసి, 24 గంటల పాటు భజనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, శ్రీరామచంద్రమూర్తి, పీపీఎన్ ప్రసాద్ సోదరులు, చాడ సన్యాసిధర్మరావు, సువర్ణల చంద్రశేఖర్, ఎం.వెంకటేశ్వర్లు, పట్టెం విశ్వేశ్వరరావు, చాడ భానుమూర్తి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సింహగిరి కిటకిట



సింహగిరి బస్టాండ్ ఏరియాలో వాహనాల రద్దీ

- సింహగిరికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ఘాట్‌రోడ్డులో భారీగా నిలిచిపోయిన వాహనాలు
- కొండదిగువ పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జామ్
- ఒక్కరోజు రూ. 53 లక్షల ఆదాయం
- రాత్రి 7.15 గంటల్లోపు 42 వేల మంది భక్తుల స్వామిదర్శనం

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో దర్శన క్యూలు కిక్కిరిశాయి. మాడ వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. అన్నప్రసాద భవనం, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల వద్ద భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీ కారణంగా అంతరాలయ దర్శనాలు రద్దు చేశారు. కేవలం నీలాద్రిగుమ్మం వద్ద నుంచే దర్శనాలు కల్పించారు. మరోపక్క సింహగిరిపై వాహనాల పార్కింగ్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ద్విచక్రవాహనాలు, కార్లు ఎక్కువగా రావడంతో పార్కింగ్ ప్రదేశాలన్నీ నిండిపోయాయి. దీంతో ఎక్కడ వాహనాన్ని పార్క్ చేయాలో తెలియక భక్తులు తికమకపడ్డారు. గజపతి సత్రం మార్గంలోను, మైక్రో టవర్‌కు వెళ్లే మార్గంలో భారీ ఎత్తున వాహనాలను పార్క్ చేశారు. అలాగే సింహగిరి ఘాట్‌రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది. దీనికి తోడు ఒక కారు ఘాట్‌రోడ్డులో మరమ్మతుకు గురై నిలిచిపోవడంతో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ట్రాఫిక్ పోలీసులు వెంటనే నిలిచిపోయిన కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అలాగే రెండో టోల్‌గేట్ ప్రవేశ ద్వారం వద్ద కూడా పెద్ద ఎత్తున వాహనాల రద్దీ నెలకొంది. కొండదిగువ తొలి పావంచా ఏరియా అంతా పెద్ద ఎత్తున వాహనాలతో నిండిపోయింది.

దేవస్థానానికి రూ.53 లక్షల ఆదాయం

శనివారం సాయంత్రానికి సింహాచలం దేవస్థానానికి సుమారు రూ.53 లక్షల ఆదాయం లభించింది. దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా సుమారు రూ.33 లక్షలు, ప్రసాదాల విక్రయం ద్వారా సుమారు రూ.13 లక్షలు, కేశ ఖండనశాల ద్వారా రూ.5.29 లక్షలు, సేవల ద్వారా రూ.93 వేలు, విరాళాల రూపంలో సుమారు రూ.80 వేలు వచ్చింది. రాత్రి 7.15 సమయానికి 42 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మరికొన్ని ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్‌లో రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం మరికొన్ని ప్రత్యేక రైళ్ల ఆయా మార్గాలలో నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

- సంబల్‌పూర్–కాచిగూడ(08325) సమ్మర్ స్పెషల్ సంబల్‌పూర్‌లో ప్రతీ సోమవారం రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.25 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 9.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 24వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కాచిగూడ–సంబల్‌పూర్(08326) సమ్మర్ స్పెషల్ కాచిగూడలో ప్రతీ మంగళవారాలలో రాత్రి 11.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.35 గంటలకు బయల్దేరి బుధవారాలలో రాత్రి 11.45 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది.
- సంబల్‌పూర్–బెంగళూరు(08321) సమ్మర్ స్పెషల్ ప్రతీ గురువారాలలో సాయంత్రం 6.45 గంటలకు సంబల్‌పూర్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 27వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో బెంగళూరు–సంబల్‌పూర్(08322) సమ్మర్ స్పెషల్ ప్రతీ శనివారాలలో తెల్లవారు 1.15 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 29వ తేదీ వరకు నడుస్తాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. సీఐ ఎం. వినోద్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న కారు వేగంగా ముందు వెళుతున్న ఆటోను ఢీకొంది. ఆ ఆటో ముందు వెళ్లే బైక్‌ను ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ చిన్ని శ్రీనివాస్‌తో పాటు దానిలో ప్రయాణికుడు, బైక్ నడుపుతున్న వ్యక్తి గాయపడ్డారు. వారిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

భారీ రాయి లోడు లారీ బోల్తా



ప్రమాదానికి గురైన లారీ

మాడుగుల: మండలంలో కింతలి నుంచి సుమారు 60 టన్నుల భారీ రాయితో వస్తున్న లారీ గాదిరాయి చెరువు వద్ద శనివారం అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయి బోల్తా పడింది. డ్రైవర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. భారీగా వర్షం కురవడం వల్ల లారీ అదుపుతప్పి ఈప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

క్లుప్తంగా

వజ్ర కవచాలంకరణలో వెంకన్న



కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకొని స్వామి వారిని వజ్ర కవచధారణతోపాటు వివిధ రకాల పూలమాలల, తులసీ మాలలతో శనివారం చూడముచ్చటగా అలంకరించారు. విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

నేడు సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణం

అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాద వితరణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలతో కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

త్రిపురాంతకస్వామి పెళ్లి రాట నేడు



కశింకోటలో పెళ్లి రాట ఉత్సవం సందర్భంగా శివాలయాన్ని నీటితో శుభ్ర పరుస్తున్న దృశ్యం

కశింకోట : కశింకోటలోని పురాతన శివాలయంలో వెలసి ఉన్న సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి వారి 108వ కల్యాణోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఉదయం 8.30 గంటలకు పెళ్లిరాట ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు వి.బాబ్జీ, వి.కృష్ణ తెలిపారు. ఈ నెల 23న ఆలయంలో స్వామి కల్యాణోత్సవం జరగనుందన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయంగా వేదమంత్రాల నడుమ పెళ్లి రాట వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆలయాన్ని నీటితో శుభ్రపరిచి సిద్ధం చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 517 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,170	5,160
రెండో రకం	3,850	4,400
మూడోరకం	3,250	3,950

అనకాపల్లి సినిమాలు

నటరత్నాలు	: రాజా
మిరల్	: సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ద ఏప్స్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
అపరిచితుడు	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 104 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-49 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-37 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 324 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అలరించిన నాటిక ప్రదర్శనలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి ఫంక్షన్ హాల్లో శనివారం రెండో రోజు ప్రదర్శించిన నాటికలు ఆహూతుల్ని అలరించాయి. జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్‌కు చెందిన 1974–75 పదో తరగతి పూర్వపు విద్యార్థులు, జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థుల ప్రతినిధి కె.ఎం.నాయుడు మాట్లాడుతూ ఆదివారం కూడా నాటిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

'బంధం' విలువను చెప్పేలా...

మనిషి జీవితం 'బంధం'తో మొదలవుతుంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్లు, మిత్రులు, గురువులు, పెళ్లయ్యాక భార్యాబిడ్డలు..ఇలా ఎన్నోబంధాలు. కానీ కడదాకా కలిసి ప్రయాణం చేసే భార్యాభర్తల బంధం ఎంతో పటిష్టమైనది. విడదీయరానిది. అందునా వృద్ధాప్యంలో ఈ బంధం మరింత బలపడి ఒకరికొకరుగా ఒకరికోసం ఒకరిగా మిగిలిపోతారు. దంపతుల మధ్య తగవులు, కీచులాటలు తాత్కాలికం, క్షణంలో మళ్లీ కలుస్తారు. కానీ కొత్తదనాన్ని తన వెర్రి ఆలోచనలతో కోరుకున్న సుబ్బారాయుడు లోకం హర్షించని రీతిలో భార్యను దూరం



బంధం నాటికలో ఓ సన్నివేశం

పెడతాడు. స్నేహితుడు నారాయణ హితోక్తులు వినడు, తానొక కొత్త గేమ్ మొదలెట్టాననుకొంటాడు. ఆ గేమ్‌ను తలకిందులు చేస్తూ ఆపైవాడు మరోగేమ్ ఆడి అతడ్ని మనస్తాపానికి గురిచేస్తాడు, తట్టుకోలేని సుబ్బారాయుడు విలపిస్తాడు, ఊహించని మరో మలుపులో కళ్లు తెరిచి తన తప్పును దిద్దుకుంటాడు.

ఆలోచింపజేసే 'నాన్న బంగారు'..

ఎదురుగా ఉన్న బిడ్డను ముద్దుపెట్టుకున్నప్పుడు కలిగే అనుభూతి, ఆ బిడ్డ ఫొటోను ముద్దు పెట్టుకున్నప్పుడు కలుగదు. ఎందుకంటే మొదటి దానిలో జీవం ఉంటే, రెండో దానిలో దాని ప్రతిబింబం ఉంటుంది. అలాగే, వీడియో కాల్‌లో మనిషికి, మనిషికి మధ్య స్క్రీన్ అడ్డం ఉంటుంది. వీడియో కాల్ బిడ్డ ఫొటోను ముద్దు పెట్టుకోవడం లాంటిది. కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఉండాలి. వారి మధ్య స్వచ్ఛమైన ప్రేమ, అభిమానాలు ఉండాలి అదీ అసలైన సంపద అంటే. ఆ సంపదను ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు చేజేతులా జార విడుచుకుంటున్నారు. మేం ఎక్కడికీ వెళ్లము, మీ దగ్గరకే ఉంటాం అని కొడుకులు ప్రాధేయ పడుతూ వున్నా, పక్కింటి సుబ్బారావు కొడుకు అమెరికా, ఎదురింటి పంకజం అల్లుడు ఆస్ట్రేలియా, నువ్వు ఇక్కడ ఉంటే, మా తల కొట్టేసినట్లుగా ఉంటుంది.. నువు వెళ్లి తీరాలి అని కొడుకుల్ని బలవంతంగా దూరం చేసుకుంటున్నారు. కానీ జీవితం చాలా చిన్నది. అందులో ఆఖరి దశలో మనిషికి ఓదార్పు, ఊరట ఇచ్చేది కన్నబిడ్డల సాన్నిధ్యం, ఆత్మీయ స్పర్శ. అందులో వుండే భరోసా, ఆనందం అమెరికా డాలర్‌లో లేదు అని చేతులు కాలాక గ్రహిస్తారు. మనిషికి కావలసిన సంపద ఏమిటీ అని తెలియజేసేదే నాన్న బంగారు నాటిక. ఈ రెండు ప్రదర్శనలూ ఆలోచింపజేస్తూ ఆహూతులను అలరించాయి.

వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం

నర్సీపట్నం: వ్యాయామంతో చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చని గ్రంథాలయ అధికారి పి.దమయంతి విద్యార్థులకు సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వ్యాయామంపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. వ్యాయామం ద్వారా ఆరోగ్యంతో పాటు క్రీడల్లో రాణించవచ్చన్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్ వ్యాయామంలో మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు పాల్గొని మూఢ నమ్మకాలపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు.



విద్యార్థులకు వ్యాయామంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి దమయంతి

నేడు వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణ గుమస్తాల సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 7 గంటలకు వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు బీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి వై.సాంబశివరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం అనంతరం నేత్రవైద్యుడు డి.పరమేశ్వరరావుతో నేత్ర సమస్యలు, నివారణోపాయాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, క్లబ్ సభ్యులు హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవం

- కేజే పురం, గాదిరాయి గ్రామాల్లో ఘనంగా వేడుకలు
- వాసవీ మాతకు ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాల్లో భక్తులు



జంపెన వాసవీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కేజే పురం జంక్షన్‌లో వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు



కేజే పురంలో వాసవీమాతకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: వాసవీ మాత జయంతి ఉత్సవాలను కేజే పురం, గాదిరాయి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. కేజే పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని ఆలయ కమిటీ, కేజే పురం వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిపారు. ఉదయం అమ్మవారికి నవ కలశ స్నపనం, పంచామృతాభిషేకాలు, నవకలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ, పూజలు, లలితాసహస్ర‌నామార్చన చేశారు. స్థానిక మాజీ సర్పంచ్ పాలకుర్తి ఆదినారాయణ కుటుంబ సభ్యుల సహకారంతో మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరిపారు. శ్రీనాధు లక్ష్మణరావు కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, వాసవీ ఇంటర్నేషనల్ చైర్మన్ శ్రీనాధు శ్రీనివాసరావు, వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనాధు శేఖర్, వీరవల్లి గ్రామానికి చెందిన మోదమాంబ భక్త బృందం సభ్యులు పాలకుర్తి శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ సభ్యులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జంపెన వాసవీమాత ఆలయంలో..

జంపెన గ్రామంలోని వాసవీమాత ఆలయంలో అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ, కింతలి గాదిరాయి సంఘం సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. జంపెన వాసవీమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు సారథ్యం జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, ఉపాధ్యక్షుడు కొట్యాడ గున్నయ్యశెట్టి, కోశాధికారి పుట్టా కొండలరావు, రీజనల్ చైర్మన్ శ్రీనాధు కన్నయ్యశెట్టి, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, జోన్ చైర్మన్ నాచు గున్నయ్యశెట్టి, కింతలి, వీరవల్లి, ఎం.కోడూరు, మాడుగుల గ్రామాలకు చెందిన వాసవీ క్లబ్ సభ్యులు, వాసవీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరాపల్లి: వాసవీమాత జయంతి పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముషిడిపల్లి అమ్మవారి ఆలయంలో వాసవీమాతను ప్రత్యేకంగా అలకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దేవరాపల్లిలో ఆర్య వైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత సామూహిక వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తపెంట వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మాడుగుల: మండలంలో సత్యవరం గ్రామంలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు.



దేవరాపల్లిలో వాసవీమాత వ్రతంలో వాసవీ మహిళలు



జి.కొత్తపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

చీడికాడ: మండలంలోని జి.కొత్తపల్లి శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన జరిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

మాకవరపాలెం: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ఎంఈవో పీఎస్ఎన్ మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్యం గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలన్నారు. దీనివల్ల ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. సమయాన్ని వృధా చేయకుండా ఇక్కడ ఉన్న విలువైన పుస్తకాలను చదువుకోవడం ద్వారా మరింత విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన ఈ శిబిరం జూన్ 7 వరకు కొనసాగుతుందని గ్రంథాలయ అధికారి చంద్రకళ తెలిపారు. ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

వేసవి శిబిరాలతో విజ్ఞానం



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

కె.కోటపాడు: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి సూచించారు. శాఖా గ్రంథాలయంలో శనివారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. తొలి రోజు విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్‌లో మెలకువలు నేర్పారు. వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందన్నారు.

పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు

75 శాతం రాయితీపై ఆర్బీకేల ద్వారా పంపిణీ

కె.కోటపాడు: వేసవిలో పాడి రైతులు పశుగ్రాసం కోసం ఇబ్బంది పడకుండా, ముందస్తు చర్యల ద్వారా గడ్డి కొరతను అధిగమించవచ్చని ఎ.కోడూరు పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ అన్నారు. ఆర్బీకేలో పాడి రైతులకు శనివారం రాయితీపై గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. 5 కిలోల కాకిజొన్న రకం గడ్డి విత్తనాలు 75 శాతం రాయితీపై రూ.115కే అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్బీకేలో ప్రస్తుతం 50 కిలోల గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీటి సదుపాయం ఉన్న పొలాల్లో ఈ విత్తనాల పెంపకం ద్వారా పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చన్నారు. ఈ గడ్డిని పశువులకు మేతగా అందిస్తే చూడి శాతం మెరుగుపడుతుందని తెలిపారు.



రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలను అందిస్తున్న సాయికుమార్

ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

రోలుగుంట: మండలంలోని రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల వద్ద రైతులకు పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావల్సిన వారు ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు

చురుగ్గా ఆస్పత్రి భవన నిర్మాణం



మాడుగులలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆస్పత్రి భవనం

మాడుగుల: స్థానికంగా చేపట్టిన 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.5.50 కోట్లు నిధులు మంజూరు కావడం, పనులు తుది దశకు చేరుకోవడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరిసర గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం తీసుకున్న చొరవను కొనియాడుతున్నారు. భవన నిర్మాణం పూర్తి కానుండటంతోపాటు, అత్యాధునిక వసతులతో ఆస్పత్రి సిద్ధమవుతుందని తెలిసి మండల ప్రజలు సంతోషంలో మునిగితేలుతున్నారు. ఇక మీదట ఏ చిన్న అనారోగ్యం వచ్చినా జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సిన అగత్యం తప్పనుందని చెప్తున్నారు.

ఘనంగా తిరు కల్యాణోత్సవాలు



కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి తిరు కల్యాణోత్సవాలు శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని పూలమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్వక్సేన పూజ, రక్షా సూత్ర బంధనం, పుట్టమన్ను తెచ్చుట, ధ్వజ పతాక ప్రతిష్ఠ, అగ్ని ప్రతిష్ఠ, హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి వెంకటాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం జరగనుందని ఆలయ కార్య నిర్వాహణ అధికారి కీర్తి శ్రీనివాసరావు తెలిపారు. 20న రాత్రి సదస్య మహోత్సవనం, పండిత గోష్టి, 23న నాగవల్లి, వసంతోత్సవం, 24న రాత్రి అష్టదళ పద్మార్చన, పుష్ప యాగం(పవలింపు సేవ) ద్వాదశ కాలార్చన, బేడాసేవ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలకు అనుమతి లేదు

కశింకోట : మండల గ్రామాల్లో నిర్వహించే పండగలు, జాతరలు, ఉత్సవాలు, సభలు, సమావేశాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ముందస్తుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ ఎం.వినోద్‌బాబు కోరారు. శనివారం ఇక్కడ మాట్లాడుతూ ప్రస్తుతం 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నందున అనుమతి తప్పనిసరి అన్నారు. పండగల సందర్భంగా ఆలయాలను ప్రజలు దర్శించడానికి అభ్యంతరం లేదన్నారు. అయితే పండగలు, జాతరల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి మాత్రం అనుమతి లేదన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున గ్రామాల్లోని కూడళ్ల, రద్దీ ప్రాంతాల్లో ప్రజలు గుమికూడి ఉండరాదన్నారు. ఎన్నికల్లో సహకరించినట్లే ఎన్నికల నిబంధనలు తొలగిపోయే వరకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



సీఐ ఎం. వినోద్‌బాబు

తాళ్లపాలెంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

కశింకోట : మండలంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం నుంచి ఓట్ల కౌంటింగ్ వరకు ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా శాంతియుత వాతావరణం కొనసాగడానికి ప్రజలకు భరోసా కల్పిస్తూ జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆర్మ్‌డ్ ఫోర్స్ పోలీసులు శనివారం పలు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్ఐ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సుమారు 60 మంది ఆర్మ్‌డ్ పోలీసులు కశింకోట, తాళ్లపాలెం, పరవాడపాలెం, కన్నూరుపాలెం, జోగారావుపేట గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ జరిపారు. స్థానిక పోలీసులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో నిర్వహిస్తున్న జార్ఖండ్ ఆర్మ్‌డ్ ఫోర్స్, పోలీసులు నిర్వహిస్తున్నప్పటి ఫ్లాగ్‌మార్చ్

ముమ్మరంగా వేసవి దుక్కులు

తుమ్మపాల : ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు సాగు భూముల్లో ముమ్మరంగా దుక్కులు చేపడుతున్నారు. వేసవిలో వర్షాలు పడడం ఈ ఏడాది రైతులకు కలిసొచ్చే అవకాశం ఉంది. మెట్ట ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేసే భూములతో పాటు, పొలాల్లో కూడా వేసవి దుక్కులు దున్నడం వల్ల ఖరీఫ్‌కు అనుకూలంగా పొలాలు తయారవుతాయి. దీంతో పంటలో కలుపు తగ్గి మంచి దిగుబడి వస్తుంది. మండలంలో తుమ్మపాల, మార్టూరు, శంకరం, రేబాక, కోడూరు.


చింతనిప్పుల అగ్రహారం, మామిడిపాలెం, బవులువాడ గ్రామాల్లో ట్రాక్టర్లతో జోరుగా దుక్కులు జరుగుతున్నాయి.



కొబ్బరి తోటలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కు

ఎం.కోడూరు మోదకొండమ్మ పండగ నేడు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరు గ్రామ ఆరాధ్య దేవత, మోదకొండమ్మా పండగ ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శనివారం తెలిపారు. ఇప్పటికే నెల రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి డప్పు వాయిద్యాలు, 101 కాగడాల ప్రదర్శన జరిపారు. పండగ సందర్భంగా ఆదివారం అమ్మవారికి వెండి వస్తువులు, పట్టు వస్త్రాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో ప్రధాన కూడళ్లను విద్యుత్ సెట్టింగ్‌లతో అలంకించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులుకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.



ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయం



ఎం.కోడూరు మోదకొండమ్మ

టీకాలతో రోగ నిరోధక శక్తి

మాడుగుల రూరల్: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా కేజే పురం పీహెచ్‌సీ పరిధిలోని 7 కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు శనివారం టీకాలు వేశారు. కేజే పురం 1, 2, శంకరం, ఎం.కోటపాడు, మాడుగుల-2, 3 సచివాలయాలు పరిధిలో, ఎం.కోటపాడు, ఎం.కోడూరు గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తల సారథ్యంలో వ్యాధి నిరోధక టీకాలు వేసి, ఐరన్ మాత్రలు ఉచితంగా అందించారు. కేజే పురం, ఎం.కోడూరు గ్రామాల్లో జరిగిన వేక్సినేషన్‌ను ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట్రావు, ఇతర చోట్ల ఆరోగ్య సహాయకులు పర్యవేక్షించారు.

కె.కోటపాడు: చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలతో వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఏఎన్ఎం కుమారి తెలిపారు. వారాడ గ్రామంలో శనివారం 0-5 ఏళ్ల వయసున్న 16 మంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. 9 మంది గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వారాడలో చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎం కుమారి

144 సెక్షన్ అమలుపై మైక్ ప్రచారం

రావికమతం: ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4 వరకూ ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురిని మించి ఒకే చోట గుమిగూడరాదని, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని రావికమతం ఎస్ఐ ధనంజయ్‌నాయుడు అన్నారు. 144 సెక్షన్, ఎన్నికల నిబంధనల అమలుపై స్టేషన్ పరిధి గ్రామాల్లో శనివారం ఆటో ద్వారా ఆయన మైక్ ప్రచారం నిర్వహించారు.

దుకాణాలు, ప్రధాన కూడళ్లలో జనాలు గుంపులుగా ఉండరాదని హెచ్చరించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు పూర్తిగా నిషేధమన్నారు.